



EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
సోమవారం
03 జూన్ 2024
పేజీలు: 02




# కవిత కస్టడీ పొడిగింపు.. జులై 3దాకా

మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది స్పెషల్ కోర్టు. జులై 3వ తేదీదాకా కస్టడీ పొడిగిస్తున్నట్లు సోమవారం ఉదయం వెల్లడించింది. లిక్కర్ కేసులో జ్యుడీషియల్ రిమాండ్ ముగియడంతో ఈ ఉదయం స్పెషల్ కోర్టుకు తీసుకొచ్చారు తీహార్ జైలు అధికారులు. ఆ వెంటనే కస్టడీని పొడిగిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. మరోవైపు కవితపై దాఖలైన ఈడీ చార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ మేరకు ఆ అభియోగ పత్రాలను కవిత తరఫు న్యాయవాదికి అందజేసింది. ఇక.. కోర్టుకు వచ్చిన కవితను భర్త అనిల్, కొడుకులను కలిసేందుకు అనుమతిచ్చారు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా.



# జైలుకు వెళ్లేందుకు నాకు ఓకే.. కానీ: డొనాల్డ్ ట్రంప్

హష్ మనీ కేసులో తాను జైలుకు వెళ్లేందుకు సిద్ధమని US మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. కానీ ప్రజలు నుంచి దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి ఇందుకు బదులు తీర్చుకుంటానని తెలిపారు. గతంలో ఓ అడల్ట్ స్టార్‌కు చేసిన చెల్లింపులను 2016 ఎన్నికలప్పుడు సమర్పించిన వివరాల్లో ట్రంప్ కప్పిపుచ్చినట్లు కోర్టు విచారణలో తేలింది.

# 93ఏళ్ల వయసులో ఐదో పెళ్లి!

మీడియా దిగ్గజం రూపర్ట్ మర్డోక్ (93) ఐదోసారి వివాహం చేసుకున్నారు. USలో తన కంటే 25ఏళ్లు చిన్న అయిన మాజీ శాస్త్రవేత్త ఎలీనా జుకోవాను పెళ్లాడారు. మర్డోక్‌కు మొదట పాట్రీషియా బుకర్‌తో పెళ్లి కాగా 1960ల్లో విడిపోయారు. ఆ తర్వాత మరియామన్, విన్‌డీ డెంగ్, జెర్రీ హాల్‌లనూ వివాహం చేసుకుని పలు కారణాలతో విడాకులు తీసుకున్నారు. వాల్ స్ట్రీట్ జర్నల్, ఫాక్స్ న్యూస్ తదితర సంస్థలను మర్డోక్ గ్రూప్ నిర్వహిస్తోంది.





# భద్రాచలంలో వృద్ధులకు నేరుగా దర్శనం

భద్రాచలం శ్రీరామచంద్రస్వామి దర్శనాలకు ఈవో కొత్త విధానాలను ప్రవేశపెట్టారు. ఇకపై 60ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లులు, వారికి సాయంగా వచ్చేవారు నేరుగా దర్శించుకోవచ్చు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు బేడా మండపంలో వేచి ఉండేందుకు వీరికి సదుపాయాలు కల్పిస్తారు. ప్రొటోకాల్ అర్హత ఉన్నవారి కోసమూ ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆఫీసులో వివరాలు అందించి కోరుకున్న దర్శనం, పూజ చేయించుకోవచ్చు.



# మైనర్ల డ్రైవింగ్‌లతో భారీగా పెరిగిన చలాన్లు

ఢిల్లీలో మైనర్లు డ్రైవింగ్ చేసినందుకు ఐదు నెలల్లో 101 చలాన్లను ట్రాఫిక్ పోలీసులు జారీ చేశారు. గత ఏడాదితో పోలిస్తే చలాన్ల జారీ 573 శాతం పెరిగిందని రికార్డులు చెబుతున్నాయి. గత ఏడాది జనవరి నుంచి మే 15 వరకు ఢిల్లీలో 15 చలాన్లు మాత్రమే జారీచేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు మైనర్ డ్రైవింగ్‌కు 101 చలాన్లు జారీ అయినట్టుగా ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.



రేపే పోలింగ్ దేశవ్యాప్తంగా..

# కౌంటింగ్ ప్రక్రియలో ఫామ్‌లు.. ప్రాధాన్యతలు

- ఫామ్-17C: ప్రతి బూత్‌లో పోలింగ్ పూర్తయిన తర్వాత ఎన్ని ఓట్లు పోలయ్యాయనే వివరాలతో పీవో సంతకం చేసి పార్టీల ఏజెంట్లకు ఇస్తారు. వీటిని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకెళ్లాలి.
- ఫామ్ 18: ఇది కౌంటింగ్ ఏజెంట్ నియామక పత్రం. ఆర్వో జారీచేసిన ఈ సర్టిఫికెట్ ఉంటేనే ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారు.
- ఫామ్ 21 C: ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు నమోదు చేసే పత్రం.
- అనెగ్జర్ 38: ఓట్ల లెక్కింపునకు నియమితులైన పర్యవేక్షకులు, హెల్పర్స్‌కు జారీ చేసే సర్టిఫికెట్.
- ఫామ్ 21 E: సెగ్మెంట్‌లో ఏ పార్టీకి, ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయి? ఎవరు గెలిచారు అనే వివరాలు ఇందులో ఉంటాయి.
- ఫామ్ 22: గెలిచిన అభ్యర్థికి ఆర్వో జారీ చేసే సర్టిఫికెట్. దీన్ని అందుకున్న వ్యక్తులు అధికారికంగా ఎమ్మెల్యే, ఎంపీగా ఎన్నికైనట్లు.
- అనెగ్జర్ 58: పార్ట్-1లో పోలింగు బూత్‌ల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల వివరాలుంటాయి. పార్ట్-2లో పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల లెక్కింపు, ఆధిక్యాలు, ఫలితాల వివరాలుంటాయి.
- అనెగ్జర్ 39: నియోజకవర్గ తుది ఫలితం వివరాలు ఇందులో సమగ్రంగా ఉంటాయి. పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల ఆధిక్యతలు నోటాతో సహా పొందుపరుస్తారు. ఆర్వో సంతకం చేసిన తర్వాత దీన్ని అధికారికంగా విడుదల చేస్తారు.

**ప్రతి టేబుల్ వద్ద ఒక ఏజెంట్: ఈసీ**

ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద ఒక ఏజెంట్‌ను నియమించుకునే అవకాశం అభ్యర్థికి కల్పించాలని కలెక్టర్లకు ముకేశ్ కుమార్ మీనా సూచించారు. RO టేబుల్ వద్ద అభ్యర్థి లేనప్పుడే ఏజెంట్‌కు అవకాశం కల్పించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చే ఏజెంట్ చేతిలో ఫాం-17C, పెన్ను/పెన్సిల్, ప్లెయిన్ పేపర్ మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. కౌంటింగ్ సెంటర్‌లోకి సెల్‌ఫోన్ కలిగిన మీడియా ప్రతినిధులను అనుమతించవద్దని సూచించారు.



# భారీ వర్షాలకు అతలాకుతలమవుతున్న శ్రీలంక.. 15 మంది మృతి

రుతుపవనాల ప్రభావంతో ద్వీపదేశం శ్రీలంకను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. భారీ వర్షాలకు వరదలు సంభవించాయి. ఈ వర్షాలకు సుమారు 10 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. శ్రీలంకలో సుమారు 300 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. బలమైన గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. దీంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ వర్షాల కారణంగా సుమారు 15 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. రాజధాని కొలంబో సహా మొత్తం ఏడు జిల్లాల్లో ఈ



మరణాలు నమోదైనట్లు చెప్పారు. ఈ వర్షాలకు 4 వేలకుపైగా ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు విపత్తు నిర్వహణ అధికారులు తెలిపారు. 28 ఇళ్లు పూర్తిగా ధ్వంసమైనట్లు చెప్పారు. వరదలకు 5 వేల కుటుంబాలకు చెందిన 19 వేల మంది నిరాశ్రయులైనట్లు పేర్కొన్నారు. రంగంలోని దిగిన శ్రీలంక సైన్యం వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ అత్యవసర ప్రతిస్పందన కోసం వైమానిక దళం మూడు హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచిందని వివరించారు. మరోవైపు భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా ద్వీపం అంతటా పాఠశాలలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరానూ నిలిపివేసింది.

# సీఎం పదవికి నితీశ్ కుమార్ రాజీనామా?

బిహార్ సీఎం నితీశ్ కుమార్ తన పదవికి మరోసారి రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది. మోదీ మంత్రి వర్గంలో చేరేందుకు ఆయన తన పదవిని వదులుకుంటారని చర్చ నడుస్తోంది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో విజయంపై బీజేపీ ధీమాగా ఉంది. ఈ క్రమంలో నితీశ్‌కు మోదీ 3.0 కేబినెట్‌లో చోటు కల్పించి బిహార్‌లో బీజేపీ అభ్యర్థిని సీఎం చేయనున్నట్లు సమాచారం.





# బడిబాట వాయిదా

రాష్ట్ర వ్యాప్తంగా ఇవాళ్టి నుంచి ప్రారంభం కావాల్సిన బడిబాట కార్యక్రమం వాయిదా పడింది. రేపు సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఎప్పట్నుంచి తిరిగి ప్రారంభిస్తుందనే విషయాన్ని ఇంకా వెల్లడించలేదు. బడి మానేసిన, బడిలో చేరని పిల్లను గుర్తించి వారిని స్కూళ్లలో చేర్చేందుకు ఈ నెల 19 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

# రేవ్ పార్టీలకు నన్నెప్పుడు పిలుస్తారా అని ఎదురుచూశా..

ఇప్పుడు రేవ్ పార్టీల గురించి పెద్ద చర్చే జరుగుతోంది. ముఖ్యంగా బెంగళూరులో జరిగిన ఓ రేవ్ పార్టీలో సినీ నటి హేమ, ఆషీరాయ్ దొరకడం సంచలనం సృష్టించింది. దీంతో ఈ రేవ్ పార్టీల గురించి పలువురు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఓ ఈవెంట్‌లోనూ దీనిపై చర్చ నడిచింది. ఈ సందర్భంగా జబర్దస్త్ బ్యూటీ రీతూ చౌదరి కూడా రేవ్ పార్టీలపై తన అభిప్రాయాన్ని వెల్లడించింది. వాటి గురించి తెలియక రేవ్ పార్టీలకు తనను ఎప్పుడెప్పుడు పిలుస్తారా అని ఆసక్తిగా ఎదురుచూశానని బయటపెట్టింది. రేవ్ పార్టీ అంటే ఏంటో ముందుగా నాకు తెలియదు.. అదేంటో తెలియక రేవ్ పార్టీకి నాకెప్పుడు ఆహ్వానం వస్తుందా? నన్నెప్పుడు పిలుస్తారా అని ఆశగా ఎదురుచూశానని రీతూ చౌదరి తెలిపింది. కానీ రేవ్ పార్టీల గురించి తెలిసిన తర్వాత వద్దని అనుకున్నానని చెప్పింది. అయితే ఇప్పటికీ రేవ్ పార్టీలపై పూర్తి అవగాహన లేదని.. ఛానల్స్‌లో చూసి అంతో ఇంతో తెలుసుకున్నానని పేర్కొంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# ఫలితాలపై తెలంగాణ బీజేపీ భారీ అంచనాలు



లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ బీజేపీ భారీ అంచనాలు పెట్టుకుంది. రేపే లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు కమలం పార్టీ ట్రైనింగ్ ఇచ్చింది. కౌంటింగ్ సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచనలు చేస్తున్నారు. డబుల్ డిజిట్ స్థానాలను దక్కించుకుంటామని బీజేపీ ధీమాలో ఉంది. తెలంగాణ బీజేపీలో ఎగ్జిట్ పోల్స్ ఉత్సాహం నింపింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 20 శాతం ఓట్లతో బీజేపీ 4 స్థానాలు గెలిచింది. సిట్టింగ్ స్థానాలతో పాటు.. మరో అరడజను సీట్లను గెలుచుకుంటామని బీజేపీ తెలిపింది. సిట్టింగ్ స్థానాలతో పాటు.. అదనంగా ఒక్క స్థానం గెలిచినా తమకు బోనసేనని బీజేపీ చెబుతోంది.రేపు ఎన్నికల కౌంటింగ్ కావడంతో పార్టీల్లో తీవ్ర టెన్షన్ నెలకొంది. కాంగ్రెస్ కంటే ముందు ఉంటామా.. లేదా? అన్న టెన్షన్‌లో బీజేపీ.. ఎక్కడ బీజేపీ ముందుకెళుతుందోనన్న టెన్షన్‌లో కాంగ్రెస్ పార్టీలున్నాయి. సర్వేలు కూడా కాస్త బీజేపీకే అనుకూలంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీలో టెన్షన్ ప్రారంభమైంది. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అగ్రస్థానంలో ఉంటుందని సర్వేలు చెప్పడం ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామం. పైగా ప్రభుత్వంపై పల్లెల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్న వార్తలు సైతం ఆ పార్టీని గందరగోళంలోకి నెట్టేస్తున్నాయి.



## పెండ్లి ట్రాక్టర్ బోల్తా.. నలుగురు చిన్నారులు సహా 13 మంది మృతి

మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో 13మంది మృతి చెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో నలుగురు చిన్నారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు.రాజస్థాన్‌లోని మోతీపురాకు చెందిన 30 మంది మధ్యప్రదేశ్‌లోని కులంపూర్‌లో జరిగే పెండ్లికి ట్రాక్టర్‌లో బయల్దేరారని, రాజ్‌గఢ్ జిల్లాలోని పీప్ లోడీ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడిందని పోలీసులు తెలిపారు. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన చికిత్స కోసం వారిని భోపాల్‌కు తరలించామన్నారు. కాగా, ఈ ఘటనపై సీఎం మోహన్ యాదవ్, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



## జపాన్‌లో 5.9 తీవ్రతతో భూకంపం

జపాన్‌లోని ఇషికావా ప్రిఫెక్చర్‌లో నిమిషాల వ్యవధిలో రెండుసార్లు భూమి కంపించింది. సోమవారం తెల్లవారుజామున 6.31 గంటలకు 5.9 తీవ్రతతో భూకంపం సంభవించింది. అదే ప్రాంతంలో మరో 10 నిమిషాల తర్వాత 4.8 తీవ్రతతో భూమి కంపించింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. నోటో పీఠభూమిలో భూకంప కేంద్రం ఉన్నదని జపాన్ వాతావరణ శాఖ తెలిపింది. భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించాయని పేర్కొంది. నోటో నగరంలో ఐదు కంటే తక్కువ తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయని తెలిపింది. ప్రస్తుతం ఎలాంటి సునామీ ముప్పు లేదని అధికారులు వెల్లడించారు. ఇదే ప్రాంతంలో జనవరి 1న సంభవించిన భూకంపంలో 230 మందికిపైగా మరణించిన విషయం తెలిసిందే.

## విషాదం..గోడకూలి ఇద్దరు చిన్నారులు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

రాజేంద్రనగర్‌లోని బాబుల్‌రెడ్డి నగర్‌లో విషాదం చోటు చేసుకుంది. రాత్రి కురిసిన వర్షానికి ఇంటి ప్రహరీ గోడ కూలి బాలిక 8(నూర్జహాన్), బాలుడు 3(ఆసిఫ్ పర్వీన్) మృతి చెందగా.. మరో ఇద్దకి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే చికిత్స కోసం క్షతగాత్రులను హాస్పిటల్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## ఇజ్రాయెలీలను నిషేధించనున్న మాల్దీవులు

ఇజ్రాయెల్ పాస్‌పోర్టు ఉన్నవారు తమ దేశంలో ప్రవేశించకుండా నిషేధించనున్నట్లు మాల్దీవులు ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా చట్టాలను మార్చే ప్రక్రియను పరిశీలించేందుకు సబ్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. గాజాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా మాల్దీవులు ఈ నిర్ణయం తీసుకుంది. కాగా గత ఏడాది దాదాపు 11,000 మంది ఇజ్రాయెలీలు ఆ దేశంలో పర్యటించారు.

## పాలిసెట్ ఫలితాలు విడుదల.. 84.20 శాతం ఉత్తీర్ణత

తెలంగాణ పాలిసెట్‌లో 84.20 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. హైదరాబాద్‌లోని సాంకేతిక విద్యా భవన్‌లో పాలిసెట్ ఫలితాలను ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. మే 24న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 92,808 మంది దరఖాస్తు చేసుకోగా 82,809 మంది హాజరయ్యారు. వీరిలో 69,728 మంది (84.20 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 46,319 మంది బాలురు పరీక్షకు హాజరవగా 37,269 మంది (80.47 శాతం), 36,496 మంది బాలికల్లో 32,459 మంది (88.94 శాతం) అర్హత సాధించారు. ఇక ఎంపీసీ విభాగంలో 84.20 శాతం, ఎమ్ బైపీసీలో 82.48 శాతం ఉత్తీర్ణత నమోదయింది. పరీక్ష రాసిన విద్యార్థులు https://sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ ఫలితాలు చూసుకోవచ్చు. ఇందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫిషరీస్, హార్టికల్చర్ డిప్లొమా కోర్సుల్లో ప్రశేశాలు కల్పిస్తారు.



## సూపర్ ఓవర్‌లో నమీబియా గెలుపు



నమీబియా-ఒమన్ మ్యాచ్ టై కావడంతో అంపైర్లు సూపర్ ఓవర్ నిర్వహించారు. ఇందులో నమీబియా ఘన విజయం సాధించింది. తొలుత ఆ జట్టు బ్యాటర్లు డేవిడ్ వైస్, ఎరాస్మస్ 6 బంతుల్లో 21 రన్స్(4,6,2,1,4,4) చేశారు. ఒమన్ 10 పరుగులు(2,0,W,1LB,1,6) మాత్రమే చేయగలిగింది. అంతకుముందు ఒమన్ 19.4 ఓవర్లలో 109/10, నమీబియా 20 ఓవర్లలో 109/6 స్కోరు చేశాయి.

## నాకేం తెలీదు.. నేను నిర్దోషిని: ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ

లైంగిక దాడి ఆరోపణల కేసులో అరెస్టయిన హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ తనను విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందానికి సహకరించడం లేదని తెలిసింది. గత రెండు రోజులుగా సిట్ అధికారులకు ప్రజ్వల్ నుంచి పూర్తి సహాయ నిరాకరణ ఎదురవుతున్నది. 'నాకేం తెలీదు.. నేను నిర్దోషిని.. నన్ను కుట్ర చేసి ఈ కేసులో ఇరికించారు' అన్న సమాధానమే ఆయన నుంచి వస్తున్నట్టు తెలిసింది. దీంతో ఆయన్ను స్పాట్ విచారణ జరపాలని సిట్ యోచిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల లెక్కింపు ప్రారంభమయ్యే మంగళవారానికి ముందే దీనిని పూర్తి చేయాలని యోచిస్తున్నది. మరోవైపు సెక్స్ వీడియోలు తీశారని భావిస్తున్న ప్రజ్వల్ యాపిల్ ఫోన్‌లోని డాటాను యాక్సిస్ చేయడానికి సిట్ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఐ క్లౌడ్‌లో నిక్షిప్తమైన ఆ డాటాను యాక్సిస్ చేస్తే, అసభ్య వీడియోలు ఆయన ఫోన్ నుంచి తీసారా లేదా అన్న విషయం నిర్ధారణ అవుతుందని సిట్ భావిస్తుంది.




ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు ప్రజ్వల్ తల్లి! ఇదే కేసులో విచారణకు గైర్హాజరైన ప్రజ్వల్ తల్లి భవాని ముందస్తు బెయిల్ కోసం సోమవారం హైకోర్టును ఆశ్రయిస్తారని తెలుస్తున్నది. కాగా.. ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణ ఇప్పటికే కిడ్నాప్ కేసులో అరెస్టయ్యి బెయిల్‌పై బయటకు వచ్చారు. అయితే ఆయన బెయిల్‌ను రద్దు చేయాలంటూ సిట్ హైకోర్టును ఆశ్రయించడంతో ఆదివారం లేదా సోమవారం ఈ అంశం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

## ఎగ్జిట్ పోల్స్ జోష్.. భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

అంతా ఊహించినట్లుగానే దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ ఏకంగా 2,000 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడింగ్ మొదలుపెట్టింది. నిఫ్టీ ఆరంభంలోనే 500 పాయింట్లకు పైగా పుంజుకుంది. ఎన్‌డీఏ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు సూచీల్లో జోష్ నింపాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలతలూ దన్నుగా నిలుస్తున్నాయి. రూపాయి బలపడడం; బ్యాంకింగ్, ప్రభుత్వ రంగ సంస్థల షేర్లు రాణించడం కలిసొస్తోంది. ఉదయం 9:23 గంటల సమయంలో సెన్సెక్స్ 1,808 పాయింట్ల లాభంతో 75,769 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 613 పాయింట్లు లాభపడి 23,144 దగ్గర కొనసాగుతోంది. అంతకుముందు సెన్సెక్స్ 76,738.89 దగ్గర, నిఫ్టీ 23,338.70 వద్ద రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేశాయి.



డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 (Sensex) సూచీలో అన్ని షేర్లూ లాభాల్లో ఉన్నాయి.

## త్వరలో గుడ్ న్యూస్ చెప్పనున్న బేబీ?



బేబీ సినిమాతో హీరోయిన్ గా మారి ప్రేక్షకులను అలరించింది.ఇదిలా ఉంటే ఇప్పుడు త్వరలోనే వైష్ణవి గుడ్ న్యూస్ చెప్పనుందని అంటున్నారు. ఇటీవలే వైష్ణవి చైతన్య, ఆశిష్ ప్రముఖ ఛానెల్ లో ఓ గేమ్ షోకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశిష్ వైష్ణవి త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పబోతోంది అని అన్నాడు. వెంటనే యాంకర్ సుమ అందుకొని నీకు ఈ మధ్యనే పెళ్లయింది చెప్తే నువ్వు చెప్పాలి గుడ్ న్యూస్ అని కౌంటర్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ప్రోమోను విడుదల చేశారు. అయితే వైష్ణవి త్వరలోనే పెళ్లి చేసుకోబోతుందా.? అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరి నిజంగాఈ వైష్ణవి పెళ్లి చేసుకోబోతుందా.? కెరీర్ లో ఇప్పుడిప్పుడే అడుగులేస్తున్న వైష్ణవి అప్పుడే పెళ్లి చేసుకోదు.. ఓ పెద్ద హీరో సినిమాలో ఛాన్స్ వచ్చిందని అంటున్నారు.